క్లుప్తంగా

వైభవంగా అంకమ్మ తల్లి కొలుపు మహోత్సవం



మైలవరం: రెడ్డిగూడెం కాపుల బజారులోని అంకమ్మ తల్లి అమ్మ వారి కొలుపు మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం జరిగింది. భక్తులు అమ్మవారికి నీళ్ల బిందెలతో జలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో విచ్చేశారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా వ్యూహ లక్ష్మీ వెంకటేశ్వర కల్యాణం



తిరువూరు: వైశాఖ పౌర్ణమి సందర్భంగా స్థానిక పాటిమీద దాసాంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం వ్యూహ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. స్వామి వారిని పెండ్లి కుమారుడిగా అలంకరించిన అర్చకులు వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా వివాహ ప్రక్రియ జరిపారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన కల్యాణ మహోత్సవంలో భక్తులు పాల్గొన్నారు. ఆలయంలో ఆదివారం ఉదయం నరసింహస్వామి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్ష్మీ నరసింహస్వామికి భక్తులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు పార్థసారథి ఆచార్యులు, స్థానాచార్యులు విఠల్ ఈ కార్యక్రమం జరిపారు.

నరసింహస్వామి జయంతి



తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలనులోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారి జయంతి ఘనంగా నిర్వహించారు. లక్ష్మీ నరసింహస్వామి, చెంచులక్ష్మి, రాజ్యలక్ష్మీదేవి మూల విరాట్‌లకు ప్రత్యేకంగా అభిషేకాలు చేశారు. స్వామి వారి విగ్రహానికి ఉసిరి నూనె, చందనం అలంకరించి ప్రత్యేక పూజాదికాలు జరిపారు. ఆలయ కమిటీ కన్వీనర్ పరుచూరి హరి మాధవ గుప్తా పర్యవేక్షించారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తిరువూరు: పాత తిరువూరులోని పోస్టు బేసిక్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. 75 సంవత్సరాల కిందట యర్రమిల్లి బుచ్చిరాజు స్థాపించిన ఈ పాఠశాలలో విద్య నభ్యసించిన వివిధ బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు సమ్మేళనానికి విచ్చేసి తమ అనుభవాలను పంచుకున్నారు. ప్రస్తుతం ఈ పాఠశాల మూసివేయడం బాధాకరంగా ఉందని, తిరిగి తెరిచేందుకు తమ సహాయ సహకారాలందిస్తామని పలువురు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు మచ్చా వెంకటేశ్వర్లు, ఎంపీ పూర్ణచంద్రరావు, నాళ్లా రామారావు, ఎల్. మల్లికార్జునరావు, ఉపాధ్యాయేతర సిబ్బందిని పూర్వ విద్యార్థులు సన్మానించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేయవచ్చునన్నారు.

విద్యార్థులకు యోగా శిక్షణ



కొణకంచి(పెనుగంచిప్రోలు): స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు యోగా, ధ్యానంపై శిక్షణనిచ్చారు. యోగా శిక్షకులు మొండితోక మణి, బి.సురేష్ పాల్గొని వారిచే యోగా సాధన చేయించారు. గ్రంథాలయాధికారి రామచంద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.

పేదలపై గుదిబండ

- గ్యాస్ ఏజెన్సీల దోపిడీ
- ఇటీవల సిలిండర్‌కు రూ.50 పెంచిన కేంద్ర ప్రభుత్వం
- డెలివరీ సమయంలో అదనంగా రూ.40 వసూలు
- పట్టించుకోని అధికారులు



కిలేశపురంలో గ్యాస్ డెలివరీ చేసేందుకు వచ్చిన గ్యాస్ సిలిండర్ల ఆటో

ఇబ్రహీంపట్నం: కొన్ని రోజులుగా వాణిజ్య సిలిండర్ ధరలను పెంచుతూ వస్తున్న ప్రభుత్వం తాజాగా గృహ వినియోగదారులపై కూడా భారం మోపింది. పేద, సామాన్య కుటుంబాలకు గ్యాస్ ధర గుదిబండగా మారింది. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న సామాన్యుడిపై మరో భారం పడింది. కేంద్ర ప్రభుత్వం పేద, సామాన్య కుటుంబాల్లో గ్యాస్ మంటలు రేపింది. గృహ వినియోగ సిలిండర్ ధర రూ.840 ఉండగా తాజాగా కేంద్రం మరో రూ.50 పెంచింది. దీంతో పేదవర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఉజ్వల పథకం లబ్ధిదారులను సైతం ప్రభుత్వం కనికరించలేదు. వారికి కూడా ఈ పెంపు వర్తింపు జేయడం గమనార్హం. ఇకపై ప్రతి 15 రోజులకు లేదా నెలకోసారి ధరలపై సమీక్షిస్తామని ప్రకటించడంతో భవిష్యత్‌లో గ్యాస్ ధర మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పౌరసరఫరాల అధికారుల చర్యలు శూన్యం

గ్యాస్ సిలిండర్ డోర్ డెలివరీని పౌర సరఫరాల శాఖాధికారులు పర్యవేక్షించాల్సి ఉంది. నెలవారీగా ఏజెన్సీ నిర్వాహకుల నుంచి వస్తున్న మామూళ్లు తీసుకొని మిన్నకుండి పోతున్నారనే ఆరోపణలు వినియోగదారుల నుంచి వస్తున్నాయి. సిలిండర్ డెలివరీ విషయంలో చాలా మంది వినియోగదారులు డెలివరీ బాయ్స్‌తో గొడవపడి ఇబ్బంది పడుతున్నారు. ఎవరైనా ఫిర్యాదులు చేస్తే తప్ప అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. 15 కిలోమీటర్ల పరిధి వరకు ఎటువంటి రుసుం వసూలు చేయరాదని కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ డెలివరీ బాయ్స్ రూ.40 వరకు అదనంగా ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. దీంతో దోపిడీ యథాతథంగా కొనసాగుతోందని వినియోగదారులు మండిపడుతున్నారు.

వినియోగదారులపై అదనపు భారం

ఇబ్రహీంపట్నం మండలంలోని గ్రామ పంచాయతీలు, కొండపల్లి మున్సిపాల్టీలో 29 వార్డుల్లో హెచ్‌పీ గ్యాస్ కనెక్షన్లు 14,163, ఇండియన్ గ్యాస్ కనెక్షన్లు 2,693, భారత్ గ్యాస్ కనెక్షన్లు 22,682, దీపం, ఉజ్వల 2,165 మొత్తం 41,703 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీరందరికీ డోర్ డెలివరీ పేరుతో ఏజెన్సీ వారు ఒక్కో వినియోగదారుడి నుంచి రూ.40 చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారు. రోజుకు సుమారు 5 వేలు డెలివరీ చేసినా రూ.2 లక్షలు, నెలకు సుమారు రూ.60 లక్షలు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా గ్యాస్ ఏజెన్సీ వారు కానీ, పౌర సరఫరాల అధికారులు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. అదనపు నగదు వసూలు విషయంలో వినియోగదారుడు, గ్యాస్ డెలివరీ బాయ్స్ మధ్య వివాదాలు జరుగుతున్నాయి. అదనపు వసూళ్లు నిలిపివేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

అదనపు వసూళ్లు నిలిపివేయాలి



గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారుల నుంచి అదనపు వసూళ్లు నిలిపివేయాలి. 15 కిలోమీటర్ల పరిధిలో ఎటువంటి రుసుం వసూలు చేయరాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయినా డెలివరీ సమయంలో ఒక్కొక్కరి నుంచి రూ.40 వరకు వసూలు చేస్తున్నారు. ఇప్పటికే కేంద్రం రూ.50 పెంచింది. నిలువుదోపిడీని అరికట్టాలని కోరుతున్నా.
– ఎం.మహేష్, సీఐటీయూ మండల కార్యదర్శి

బిల్లుపై ఉన్న రేటు చెల్లిస్తే సరిపోతుంది

15 కిలోమీటర్ల వరకు గ్యాస్ సిలిండర్ డెలివరీ కోసం ఎలాంటి రుసుం వసూలు చేయకూడదు. అలా చేస్తే ఫిర్యాదు చేయండి. తక్షణమే చర్యలు తీసుకుంటాం. ఏజెన్సీ వారు విధిగా నిబంధనలు పాటించాలి. గ్యాస్ వినియోగదారుడు బిల్లుపై ఉన్న ధర చెల్లిస్తే సరిపోతుంది. అదనపు వసూళ్లపై ఫిర్యాదు చేస్తే ఏజెన్సీలకు జరిమానా విధిస్తాం.
– రామకృష్ణ, పీడీఎస్ డిప్యూటీ తహసీల్దార్

మట్టి అక్రమ రవాణా నిరోధానికి చర్యలు

నూజివీడు: మండలంలోని అన్ని గ్రామాలలో మట్టి అక్రమ రవాణా జరగకుండా మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులను ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని ఆదేశించామని తహసీల్దార్ గుగులోతు భద్రు ఆదివారం తెలిపారు. సుంకొల్లు చెరువులో మట్టి అక్రమ రవాణా జరుగుతుందనే సమాచారం మేరకు వీఆర్వోను అక్కడికి పంపామని, రెవెన్యూ అధికారి అక్రమ మట్టి రవాణాను అడ్డుకున్నారని చెప్పారు. మండలంలో ఎక్కడైనా మట్టి అక్రమ రవాణా జరుగుతుంటే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

సీపెట్ డిప్లమో కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

మైలవరం: సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్) డిప్లమో కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డైరెక్టర్ అండ్ హెడ్ డాక్టర్ సీహెచ్ శేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్హతతో మూడేళ్ల వ్యవధి గల డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ(డీపీటీ), డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ), బీఎస్సీ విద్యార్హతతో రెండేళ్ల వ్యవధి గల పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ పెరాసెస్సింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ–పీపీటీ) కోర్సులకు ఆన్‌లైన్‌లో ఈనెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కోర్సులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉందని, సీపెట్ అడ్మిషన్ టెస్ట్ జూన్ 8 జరుగుతుందని చెప్పారు. అందులో వచ్చిన ర్యాంకు ఆధారంగా విజయవాడ కేంద్రంలో గల 150 సీట్లను భర్తీ చేస్తారని చెప్పారు. ఇతర వివరాలకు ఎస్. రామకృష్ణ, సెల్–93985 35697 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మాతృ దేవోభవ



కేతనకొండ గ్రేస్ చర్చి మినిస్ట్రీస్‌లో మాతృ దినోత్సవం



రెడ్డిగూడెం ప్రేమ విందులో పాల్గొన్న మహిళలు

తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలను గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా ఆదివారం మాతృ దినోత్సవాన్ని నిర్వహించారు. పిల్లల ఎదుగుదలకు తల్లి ఆవశ్యకతను తెలిపే విధంగా బాల, బాలికలకు పోటీలు నిర్వహించారు. తల్లులకు పిల్లలు మాతృ దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపేందుకు గ్రీటింగ్ కార్డులను గ్రంథాలయాధికారి శ్రీలత పర్యవేక్షణలో బాలలు తయారుచేశారు.



పెనుగొలను గ్రంథాలయంలో గ్రీటింగ్ కార్డులు తయారు చేసిన బాలలు

కనిపించే దైవం అమ్మ..

మైలవరం: కనిపించే దైవం అమ్మ అని, అమృతం ఎలా ఉంటుందో తెలియదు కానీ అమ్మ ప్రేమ ముందు అది ఎంతో తక్కువ అని ఎంబీఎం జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఒకేషనల్ ట్రైనర్ బలగాని తిరుమల అన్నారు. మైలవరం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో జరిగిన కార్యక్రమంలో తిరుమల మాట్లాడుతూ ధనం లేనివాడు పేదవాడు కాదని, అమ్మ ప్రేమ లేని వాడే అతి పేదవాడు అని అన్నారు. అనంతరం సైన్స్ విభాగంలో మానవునిలోని ఎముకల సంఖ్య, అవి ఉండే ప్రదేశాలను వివరించారు. విద్యా ర్థినీ, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- **కేతనకొండ(ఇబ్రహీంపట్నం):** కేతనకొండ గ్రేస్ చర్చ్ మినిస్ట్రీస్‌లో మాతృ దినోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. సంస్థ డైరెక్టర్ డాక్టర్ మొగులూరు ఎలీషా మాట్లాడుతూ భూమి మీద ప్రేమకు అతి గొప్ప నిదర్శనం అమ్మ ప్రేమ అన్నారు. అమ్మ తన పిల్లల నుంచి ఏమీ ఆశించకుండా ప్రేమిస్తోందని, పిల్లల అవసరాలను అర్థం చేసుకుంటుందన్నారు. అమ్మ జీవితం ప్రేమ, త్యాగానికి నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మాతృమూర్తులను శాలువాలతో సత్కరించి బహుమతులు అందజేశారు. సంస్థ కార్యదర్శి సుమలత, పెద్దలు అబ్రహాం, మాణిక్యరావు, యోబు, హరీష్, ప్రభుదాసు, అనిల్, సంఘస్తులు పాల్గొన్నారు.

మాతృమూర్తులకు ప్రేమ విందు

మైలవరం: రెడ్డిగూడెంలో ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవం సందర్భంగా మాతృమూర్తులకు ఆదివారం ప్రేమ విందు ఏర్పాటు చేశారు. సంస్థ అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ కనిపించే దైవం అమ్మ అని, అమ్మను ప్రేమగా చూసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా వృద్ధులు తమ అభిప్రాయాలను, జీవన విధానాలను ఒకరికొకరు పంచుకున్నారు. కుటుంబ వ్యవస్థలో తల్లులకు ఓర్పు చాలా అవసరమని వారు చెప్పారు.

స్వామిదాసును కలిసిన అనుబంధ విభాగాల అధ్యక్షులు



స్వామిదాసు, సుధారాణి దంపతులను మర్యాదపూర్వకంగా కలిసిన పచ్చిగోళ్ల పండు తదితరులు

తిరువూరు: ఇటీవల నియమితులైన వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు ఆదివారం పార్టీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసును ఆయన నివాసంలో కలిశారు. జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఏలూరి శివాజీ, విద్యార్థి విభాగం అధ్యక్షుడు జొన్నలగడ్డ కోమల సాయి, ఐటీ విభాగం అధ్యక్షుడు పచ్చిగోళ్ల పండు, తిరువూరు నియోజకవర్గ ఐటీ విభాగ అధ్యక్షుడు సోమవరపు మల్లికార్జునరావులు స్వామిదాసును కలిసిన వారిలో ఉన్నారు.

కారును ఢీకొట్టిన టిప్పర్

ముగ్గురికి గాయాలు



పుల్లూరు వద్ద కారును ఢీకొన్న టిప్పర్ లారీ

మైలవరం: మైలవరం మండలం పుల్లూరు సమీపంలో జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ నుంచి విజయవాడ వెళుతున్న కారును ఇబ్రహీంపట్నం నుంచి తిరువూరు వెళుతన్న టిప్పర్ లారీ పుల్లూరు సమీపంలో జాతీయ రహదారిపై ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న గోగినేని ఉమామహేశ్వరరావు, అతని కుమారుడు, స్నేహితుడు స్వల్పంగా గాయపడ్డారు. కారులో బెలూన్లు తెరుచుకోవడంతో పెను ప్రమాదం నుంచి బయటపడ్డారని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

అనుమానాస్పద వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలి



నూజివీడు బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న సీఐ

నూజివీడు: అనుమానాస్పద వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ పి.సత్య శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని బస్టాండ్‌తో పాటు జన సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆదివారం సీఐ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తులను గుర్తించడం, మద్యం, గంజాయి, డ్రగ్స్, పేలుడు పదార్థాల అక్రమ రవాణాను అడ్డుకోవడం, శాంతి భద్రతలకు ముప్పుగా మారే అసాంఘిక శక్తులను గుర్తించడం లక్ష్యంగా తనిఖీలు నిర్వహించామన్నారు. కొన్ని తీవ్రవాద గుంపులు దేశంలోకి చొరబడే ప్రమాదం పొంచి ఉన్నందున అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు భద్రతా చర్యలు చేపట్టామని వివరించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

నూజివీడు: కార్మికులు పోరాడి, ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసి వాటి స్థానంలో లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందని సీపీఎం నూజివీడు కార్యదర్శి జి. రాజు విమర్శించారు. ఈ నెల 20న దేశవ్యాప్తంగా ఉద్యోగ, కార్మిక వర్గాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ కార్యాలయంలో నూజివీడు అధ్యక్షుడు ఎస్ఆర్ హనుమాన్లు అధ్యక్షతన ఆదివారం సీఐటీయూ విస్తృత సమావేశం నిర్వహించారు. రాజు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు, కార్పొరేట్ కంపెనీలకు అనుకూల విధానాన్ని అమలు చేయాలని చూస్తోందని దుయ్యబట్టారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదని, కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సురేంద్ర, నాగూర్, రంగారావు, నాగరాజు, నరేష్, స్టాలిన్, శ్రీనివాసరావు, ఏకేడీ ప్రసాద్, ఏసు, రమేష్, ఆదిలక్ష్మి, నాగమణి, రజని, రాజేష్ పాల్గొన్నారు.

116 మందికి కంటిపరీక్షలు

నందిగామటౌన్: పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించేందుకే భగవాన్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి నెలా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని సమితి నందిగామ కన్వీనర్ వాసుదేవరావు తెలిపారు. పట్టణంలోని భగవాన్ సత్యసాయి మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పెదకాకాని శంకర నేత్రాలయం వైద్య సిబ్బంది 116 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. 56 మందికి కంటి శుక్లాల ఆపరేషన్ అవసరమని గుర్తించి, వారిని పెదకాకాని ఆస్పత్రికి తరలించారు. తొలుత సత్యసాయికి ప్రత్యేక పూజలు చేశారు. వాసుదేవరావు మాట్లాడుతూ సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు సేవలందించడం ఎంతో సంతృప్తినిస్తోందని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో సిలువ ఊరేగింపు

వీరులపాడు: సర్వమానవాళి రక్షణ కోసమే ఏసుక్రీస్తు ఈలోకానికి వచ్చారని ఫాదర్ నీలూరి లూర్దురాజు తెలిపారు. మండలంలోని జమ్మవరం, బోడవాడ గ్రామాల్లో వేంచేసి ఉన్న పరిశుద్ధ లూర్దుమాత ఆలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఏసుక్రీస్తు సిలువను గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఏసు చూపిన బాటలో నడుచుకోవాలన్నారు. ఈనెల 13న పునః ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, భక్తులు, క్రైస్తవులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. గ్రామ నాయకులు కర్ల రాజు, యాదాల దాసు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేసవి సెలవులతోపాటు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. భక్తులు పాలపొంగళ్లు, బోనాలతో అమ్మవారిని మొక్కులు చెల్లించుకున్నారు. ఆంధ్రా నుంచే గాక తెలంగాణ నుంచి వందల సంఖ్యలో వాహనాల్లో భక్తులు తరలి వచ్చారు. ఆలయ అధికారులు భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు వాహనాల రద్దీ కొనసాగింది. ఆలయం చుట్టూ కాకుండా గ్రామంలో ఎక్కడ చూసినా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టారు. భక్తులు ఎండవేడికి తట్టుకోలేక ఉదయం నుంచి సాయంత్రం వరకు మునేరు అవతల మామిడి తోటల్లో సేదతీరారు.

గండేపల్లి రోడ్డుకు మరమ్మతులు చేపట్టరూ...



గండేపల్లి నుంచి కీసర వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుపై పడిన గుంతలు

కంచికచర్ల: మండలంలోని గండేపల్లి నుంచి కీసర వెళ్లే రోడ్డు గుంతలమయం కావడంతో వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోతుల విషయం తెలియక రాత్రివేళ పలువురు వాహన చోదకులు వీటిల్లో పడి గాయాల పాలవుతున్నారు. గండేపల్లిలో సెంటినీ కర్మాగారానికి ఇతర ప్రాంతాల నుంచి పెద్ద పెద్ద వాహనాల కారణంగా రోడ్డు రోజురోజుకు దెబ్బతింటోందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. చిన్నపాటి వర్షానికే ఆయా గోతుల్లో నీరు నిలుస్తుండటంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి గండేపల్లి–కీసర రోడ్డును అభివృద్ధి చేయాలని వాహన చోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో బీసీలపై దాడులు



పెనుగంచిప్రోలు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో బీసీలపై దాడులు జరుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు అన్నారు. పెనుగంచిప్రోలులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ మంత్రి, బీసీ మహిళా నేత విడదల రజనిపై దురుసుగా ప్రవర్తించిన చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బానాయుడు తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రజనితో అనుచితంగా ప్రవర్తించడంతోపాటు మీపై కూడా కేసు పెడతానని పేర్కొనడం ఆయన దురహంకారానికి నిదర్శమన్నారు. ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వం, రానున్న రోజుల్లో బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షులు దేరంగుల శ్రీనివాసరావు, బీసీ నాయకులు చేని రాంబాబు, గుడిమెట్ల శంకర్, బొజ్జా సాయి, నలబోతు వెంకటేష్ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి

గానుగపాడు(తిరువూరు): విద్యార్థులకు నాణ్యమైన బోధననందిస్తూ, ప్రతి సంవత్సరం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తున్న గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలని పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు రాంప్రదీప్ గ్రామస్తులను కోరారు. ఆదివారం గ్రామంలో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మారుమూల ఉన్న గానుగపాడులో ఉన్నత పాఠశాల ఏర్పాటుకు ఎందరో కృషి చేశారన్నారు. తాను గ్రామాభివృద్ధికి స్వచ్ఛందంగా కృషి చేస్తూ గ్రామాన్ని దత్తత తీసుకున్నానని చెప్పారు. అన్ని దానాల్లోనూ విద్యా దానం గొప్పదని, పాఠశాలలో ప్రభుత్వం సమకూర్చే సౌకర్యాలకు అదనంగా దాతలు సహకరిస్తే విద్యార్థులు మరింత ప్రగతి సాధిస్తారని వివరించారు. సమావేశంలో తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్‌లు సత్ప్రవర్తనతో మెలగాలని, సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. ఆదివారం స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. షీటర్లపై పోలీసుల నిరంతర నిఘా ఉంటుందని పేర్కొన్నారు. మంచి ప్రవర్తన కలిగి ఉండి కుటుంబసభ్యులతో సంతోషంగా జీవించాలని సూచించారు.